ఈవీఎంలను సిద్ధం చేయాలి: కలెక్టర్ శ్రీహర్ష

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 10: రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం ఈవీఎంలను సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘానికి తనిఖీ నివేదిక పంపిస్తామన్నా రు. అనంతరం గోడౌన్ సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రాంచందర్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో రవీందర్

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఈవోర వీందర్

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 10: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని డీఈవో రవీందర్ సూచించారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని హరిజనవాడ జెడ్పీహైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యశీలారెడ్డికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు డీఈవోను సన్మానించారు. అలాగే ఆలూర్ జెడ్పీ హైస్కూల్‌ను డీఈవో సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారాంతపు పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 10: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని డీఈవో రవీందర్ అన్నారు. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని ఎస్వీకేఎం పాఠశాలలో శనివారం నిర్వహించిన క్రీడోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. పోటీల్లో హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోని మొత్తం 12 పాఠశాలల కు చెందిన 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేష న్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మల్లారెడ్డి, ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ విలియం, పాఠశాల ప్రిన్సిపాల్ వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

• మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్, ఫిబ్రవరి 10: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని 3వ వార్డు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారిస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా అవుతారన్నారు. ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోప్లాపూర్ సత్యనారాయణ, గోవర్ధన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

బాలానగర్, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్య క్రమంలో నాయకులు దత్తాత్రేయ, యాదయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రఫీక్, హరిసింగ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల దరఖాస్తులకు రేషన్‌కార్డు తిరకాసు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 10: జడ్చర్లలోని ఎర్రగుట్ట వద్ద కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న తాసీల్దార్ కార్యాలయ సిబ్బంది దరఖాస్తుతో పాటు రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు జతచేయాలని తిరకాసు పెట్టారు. రేషన్‌కార్డు లేనిదే దరఖాస్తుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించటంలేదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్‌అలీ శనివారం జడ్చర్ల తాసీల్దార్ సత్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు మళ్లీ డబుల్‌బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించటంపై క్లారిటీ ఇవ్వాలని కోరారు.

దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలి

• నారాయణపేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 10: ప్రజాపాలన దరఖాస్తుదారుల వివరాలను నిశితంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గ్యాస్ సబ్సిడీ దరఖాస్తుల పరిశీలనలో భాగంగా శనివారం మక్తల్ మండలం లింగంపల్లిలో అదనపు కలెక్టర్ పర్యటించారు. ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఏడీఏ జాన్‌సుధాకర్, అధికారులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

నారాయణపేట, ఫిబ్రవరి 10: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. శనివారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సీసీరోడ్ల ప్రగతిపై పంచాయతీరాజ్ డీఈ, ఏఈలతో సమీక్షించారు. కొన్ని గ్రామాల్లో నేటికీ పనులు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. తప్పుడు సమాచారంతో ప్రగతి పనుల జాబితా ఇస్తే సహించేది లేదన్నారు. రోడ్డు పనుల వివరాలు సరిగ్గా తెలపాలని మాగనూర్ ఏఈపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో డీఆర్‌డీవో గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నమోదు చేయాలి

బాలానగర్, ఫిబ్రవరి 10: మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్లకు ప్రభుత్వం అందించే రాయితీ కోసం పకడ్బందీగా లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ బాబురావు అన్నారు. మండలంలోని హేమాజీపూర్‌లో పథకం దరఖాస్తులను ఎంపీడీవో కృష్ణారావుతో కలిసి ఆయన పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని అప్పాజిపల్లి, నేలబండతండాలో ఏర్పాటు చేసిన నర్సరీ పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఇంటింటి సర్వే

దేవరకద్ర, ఫిబ్రవరి 10: మండలంలో మహాలక్ష్మి లబ్ధిదారుల ఇంటింటి సర్వే కొనసాగుతున్నది. శనివారం మండల ప్రత్యేకాధికారి రవీందర్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు దారుల ఇండ్లకు వెళ్లి రూ. 500 గ్యాస్ సిలిండర్ కోసం వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ విద్యుత్ మీటర్ల నెంబర్లు సేకరిస్తున్నా ట్లు మండల విద్యుత్ అధికారి సత్తయ్య తెలిపా రు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

మహబూబ్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 10: ప్రజాపాలన దరఖాస్తులను పురపాలిక సిబ్బంది ఆయా వార్డుల్లో పరిశీలించారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి దరఖాస్తులను పరిశీలించి, యాప్‌లో గ్యాస్ నెంబర్, వివరాలు నమోదు చేశారు. 18వ వార్డులో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ పరిశీలించారు.

బాధ్యతలు చేపట్టిన డీపీఆర్‌వో

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 : మహబూబ్‌నగర్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు (డీపీఆర్‌వో)గా పి.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. అనంతరం కలెక్టర్ రవినాయక్‌ను కలిశారు. ఇక్కడి డీపీఆర్‌వో వెంకటేశ్వర్లు నల్లగొండకు బదిలీ అయ్యారు.

తాసీల్దార్ల బదిలీ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ ఆర్డీవో పవన్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామకృష్ణ బదిలీపై వచ్చారు. మహబూబ్‌నగర్ డిప్యూటీ కలెక్టర్‌గా నిర్మల, రాంరెడ్డి వచ్చారు.

వాణిజ్య విజ్ఞాన ప్రదర్శన

పాలమూరు, ఫిబ్రవరి 10: మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వాణిజ్య విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సందర్శించి గ్రీన్ కామర్స్ ప్రాముఖ్యతను వాణిజ్య విధానంలో వచ్చిన మార్పును, వివిధ శాస్త్రవేత్తల సిద్ధాంతాల గురించి వివరించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డా.నాగలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపాదగంగాధర్, అకాడమిక్ కోఆర్డినేటర్ లావణ్య, ఐక్యూఏసీ, కో ఆర్డినేటర్, డా.విజయలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

హన్వాడ, ఫిబ్రవరి 10: మండలంలోని వేపూర్ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శనివారం మృతదేహం లభ్యమైంది. వేపూర్ గ్రామానికి చెందిన భీమయ్య తన వ్యవసాయ పొలంలోని బావిలో నుంచి దుర్వాసన రావడంతో దగ్గరకు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. దీంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు అక్కడికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

• స్వామివారికి అలంకారాభిషేకం

ఆలయంలో కలశ పూజ చేస్తున్న దృశ్యం

జడ్చర్ల, ఫిబ్రవరి 10: మండలంలోని గంగాపూర్‌లో లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం మొదటి రోజు అలంకారాభిషేకం నిర్వహించారు. ఉదయం వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య పుణ్యాహవాచనము, అష్టోత్తర శత(108) కలశాభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన వస్త్రములు, వెండి ఆభరణాలు, బంగారు కిరీటంతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అదేవిధంగా ఆలయ ఈవో దీప్తిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శోభాగోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనంతరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ చెన్నకేశస్వామి

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

• పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

డాక్టరేట్‌ప ట్టానుఅం దజేస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు, ఫిబ్రవరి 10: పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పీయూ వీసీ లక్ష్మీ కాంత్‌రాథోడ్ సూచించారు. పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలను వీసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బార్‌కోడ్, సబ్జెక్టు, రూల్ నెంబర్ కోడ్‌లు సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, చీఫ్ సుపరింటెండెంట్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్

పాలమూరు విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ఆదెర్ల కరుణాకర్‌రెడ్డి శనివారం పీయూ ఉపకులపతి లక్ష్మీకాంత్‌రాథోడ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొం దారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ సి.మధుమతి పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ ఎఫికసీ, కంప్యూటర్ యాంక్షైటీ అండ్ యాటిట్యూడ్ వర్డ్స్ ఈ లెర్నింగ్ అమాంగ్ బీ.ఎడ్ స్టూడెంట్స్ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా సాధించారు. పీయూ వోఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ జంగం విశ్వనాథ్, భూమయ్య, పీఆర్‌వో రవికుమార్, ఆంజనేయులు, వినోద్ శుభాకాంక్షలు తెలిపారు.

నేటితరం విద్యార్థులు ఎంతో అదృష్టవంతులు

• జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

భూత్పూర్,ఫిబ్రవరి10: నేటితరం విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని న్యూఎరా హైస్కూల్‌లో నిర్వహించిన 23వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంఈవో నాగయ్య, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కరస్పాండెంట్ క్రాంతికుమార్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, హెడ్మాస్టర్ భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని కలిసిన గిరిజన నాయకులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 10: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు, మండల సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా.లక్ష్మారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈనెల 15న ఊరంచుతండాలో నిర్వహించే సేవాలాల్ జయంతికి హాజరుకావాలని కోరారు. అలాగే సేవాలాల్ దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు లింబ్యానాయక్, చందర్‌నాయక్, శంకర్‌నాయక్, రాములునాయక్, తరుణ్‌నాయక్, మాన్యనాయక్, నర్సింహానాయక్, రాజునాయక్, శ్రీనునాయక్, చందునాయక్, లింబ్యానాయక్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ లక్ష్మణ్‌గౌడ్

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

పాలమూరు, ఫిబ్రవరి 10: మహబూబ్‌నగర్‌లోని లుంబిని హై స్కూల్‌లో శనివారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 42మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటివారికి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కే.లక్ష్మణ్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ మరియం సారా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణలో..

కృష్ణ, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని ముడుమాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. కలెక్టర్‌గా ముబీనా, డీఈవోగా శృతి, హెచ్‌ఎంగా గణేశ్, ఎంఈవోగా నందిని , పాఠశాల చైర్మన్‌గా హన్మంతు వ్యవహరించారు.

నల్లగొండ సభను విజయవంతం చేయాలి

• జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య

జడ్చర్లలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 10: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య పిలుపునిచ్చారు. శనివారం జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి బహిరంగ సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభకు జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షు డు రఘుపతిరెడ్డి, కౌన్సిలర్లు రఘురాం గౌడ్, శశికిరణ్, పిట్టల మురళి, ఇంతియాజ్, జంగయ్య, రాంమోహన్, శంకర్‌నాయక్, కరాటే శ్రీను, సురేశ్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

చలో నల్లగొండ పోస్టర్లు విడుదల

దేవరకద్ర, ఫిబ్రవరి 10: చలో నల్లగొండ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బలరాజు అన్నారు. శనివారం వారు పార్టీ శ్రేణులతో కలిసి చలో నల్లగొండ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్ణం రాజు, ఉమ్మగారి వెంకటేశ్, సత్యంసాగర్, శంకర్, యుగేంధర్‌రెడ్డి, రాధాకృష్ణ, పురేందర్, మన్యం, లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకులలో..

మూసాపేట, ఫిబ్రవరి 11: అడ్డాకుల మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చలో నల్లగొండ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఖాజాగోరి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రమేశ్, చంద్రకాంత్, దేవదానం, డేవిడ్ తపాల్గొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేట, ఫిబ్రవరి 10: ఈనెల 13న నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రకాంత్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సుభాష్, వినోద్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

మహ్మదాబాద్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం కామన్ ఎంట్రెన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని నంచర్ల గురుకుల పాఠశాలలో 528 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

పుస్తకావిష్కరణ..

పాలమూరు, ఫిబ్రవరి 10: మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు వంగీపురం శ్రీనాథాచారి రచించిన ఎన్ ఇన్వాలబుల్ ఇన్వెస్టిగేషన్ పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా పీయూ ఉపకులపతి లక్ష్మీకాంత్‌రాథోడ్, ఆత్మీయ అతిథిగా ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నర్సరీలపై శ్రద్ధ తీసుకోవాలి

కోయిలకొండ, ఫిబ్రవరి 10: పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో జయరాం సూచించారు. శనివారం మండలంలోని పారుపల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో నర్సయ్య, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడం గర్వకారణం

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 10: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న ఇవ్వడం గర్వకారణమని మాజీ మంత్రి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పీవీ సేవలకు గౌరవం దక్కిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి ఎంతో సేవచేసిన పీవీకి కాంగ్రెస్ పార్టీ గౌరవం ఇవ్వలేదని, ఆయన మరణించినప్పుడు భౌతికకాయాన్ని ఏఐసీసీ భవనంలోకి అనుమతించలేదని విమర్శించారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పాలమూరుకు మొండిచెయ్యి

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్నివర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసిందని, పాలమూరుకు మొండి చెయ్యి చూపించిందని మహబూబ్‌నగర్ రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గోపాల్ యాదవ్ శనివారం ప్రకటనలో విమర్శించారు. వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్ రైతు రుణమాఫీ, రైతు బంధుకు సరిపోవడం లేదని, అంకెల గారడీగా ప్రకటించారని, రైతుబంధు, రైతు రుణమాఫీ గురించి సరైన సమాధానం చెప్పకుండా త్వరలోనే ప్రకటిస్తామని అనడం రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు మొదటి ప్రాధాన్యత కల్పించేవారని గుర్తు చేశారు.

సత్తా చాటిన పేట క్రీడాకారులు

నారాయణపేట, ఫిబ్రవరి 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రో.జయశంకర్ స్టేడియంలో శనివారం జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పేట జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. అండర్ 8 బాలికల విభాగంలో పార్వతి స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో రజత పతకం సాధించగా, అండర్ 12 బాలికల విభాగంలో అశ్విని వందమీటర్ల పరుగులో వెండి పతకం, రాజేశ్వరి 600 మీటర్ల పరుగులో వెండి పతకం సాధించింది. అండర్-12 బాలుర విభాగంలో శివలింగప్ప 100 మీటర్ల పరుగురజతం, విష్ణు లాంగ్‌జంప్‌లో రజతం సాధించాడు.

క్రెడిట్‌కార్డు వచ్చిందంటూ రూ.లక్ష కాజేశారు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి10 : మీకు క్రెడిట్‌కార్డు వచ్చింది.. మీ అడ్రస్, ఫోన్ నెంబర్‌కు లింక్ పంపిస్తా ఐడి నెంబర్ క్లిక్ చేయడంటూ నమ్మబలికిన సైబర్ నేరాగాళ్లు ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాల నుంచి రూ.లక్షకు పైగా తస్కరించారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లా బద్వేలుకు చెందిన వెంకటేశ్వర్లు జడ్చర్లలోని వెంక టేశ్వరకాలనీలో నివాసముంటున్నాడు. ప్రయివేటు ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్వర్లుకు జనవరి 28న ఓ ఫోన్ నెంబర్ నుంచి క్రెడిట్‌కార్డు వచ్చినట్లు మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత 85838 288 33 నెంబర్ నుంచి కొరియర్‌బాయ్‌ని మాట్లాడుతున్నానంటూ, ఫోన్ నెంబర్‌కు లింక్ పంపిస్తా ఐడి నెంబర్ చెప్పండంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తర్వాత తన ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా మీకు క్రెడిట్‌కార్డు వస్తుందని సదరు వ్యక్త